
# మేడమీద అబ్బాయి



ఎనిమిదేళ్ళ క్రితం సోషల్ సైన్సు టీచరు—కామేశ్వరరావు.

ఈ ప్రపంచం మరిచిపోయిన కామేశ్వరరావుని వెతుక్కుంటూ వచ్చిన ఇతగాడెవరు?

మోటారు సైకిల్ మీదొచ్చిన అతగాడి మాటలు అనుమానాస్పదంగా వున్నా కామేశ్వరరావు మాష్టారి గురించి వాకబు చేయడంలో కొంత నిజాయితీ కనబడింది. అంతకు మించి అతడికి గది కావలసిన అవసరం కనబడింది.

తన మనసులోని భావాల్ని ఓ పక్కకు నెట్టేసి—

"నీకు పెళ్ళయిందా?" మౌర్య నుద్దేశించి అడిగాడు కామయ్య.

"కాలేదు..."

"బ్రహ్మచారికి గది ఎవరిస్తారయ్యా?"

"అందుకే గదండీ కామేశ్వరరావు మాష్టార్ని వెదుక్కుంటూ వచ్చింది. ఈ చిన్న సాయం చేసిపెట్టండి చాలు—మీ రుణం తీర్చుకుంటాను."

"బ్రహ్మచారికి, అందునా ముక్కూ మొహం తెలియని వాడికి గది ఇప్పించడం చిన్న సాయం ఎలా అవుతుంది? ఏభై ఏడు మంది ఎంపీల సపోర్టు వున్న చంద్రశేఖర్‌ని ప్రధానిని చేయడానికి రాజీవ్ గాంధీ ఎంత సాయం చేశాడో నేనూ నీకు అంత సాయం చేయాలి మరి..."

కారు దిగిన పెద్దమనిషికి,తనకి దారం తరిగిపోవడం గమనించిన కామయ్య తిరిగి అన్నాడు, "సరే.. .ఓ పెద్దాయన వస్తున్నాడు. చక్రం తిప్పుతాను చూడు..." అని అన్నాడు.

"ఏం కాముడూ...ఈ పేపర్లో విశేషాలేమిటి?" అంటూ వచ్చిన ఆ నడివయస్కుడు మౌర్య వైపు తేరిపార జూస్తూ "ఎవరీ కుర్రాడు?" అనడిగాడు.

"నమస్కారమండీ...నా పేరు మౌర్య" అని మౌర్య తన వివరాలు ప్రారంభించగానే, మధ్యలో అందుకుని "ఇంజనీరుగా పని చేస్తున్నాడు. మీవాడే. పై పెచ్చు బ్రహ్మచారి. ఇల్లు చూసుకుని, వండి వార్చడానికి ఓ వంటవాణ్ణి కుదుర్చుకునే వరకు టెంపరరీగా ఓ గది అద్దెకు కావాలట...'మీ ఇంట్లో గది అద్దెకు ఇస్తారా?' అని నన్ను అడిగాడు. కాని కులం వాడికి చూస్తూ చూస్తూ గది అద్దెకు ఎలా ఇవ్వగలను?" అని ఎదురు ప్రశ్న వేశాడు కామయ్య.

"ఏమిట్రోయ్...నువ్వేనా ఈ మాటలంటున్నది? కులం...గోత్రం పట్టింపులు నీకూ వున్నాయా? ఇన్నేళ్ళ తర్వాత ఓ కొత్త విషయం తెలిసింది."

"వేలు వంకర పెట్టనిదే వెన్న అయినా రాదంటారు. మా ఇంట్లో పెళ్ళికెదిగిన ఓ అమ్మాయి వుంది. ఇంట్లో ఆడపిల్లని పెట్టుకుని బ్రహ్మచారికి గది అద్దెకు ఎలా ఇవ్వగలను?"

"రేయ్...రేయ్ కాముడూ, మరొక్క మాట నోరు జారావంటే నాలుక చీరేస్తాను. సీత నిజంగా సీతే. ఈ కాలంలో వుండాల్సిన ఆడపిల్ల కాదు. నువ్వు పేపరు కంఠతా చేస్తూ—పేకాట ఆడుకుంటూ కూర్చుంటే ఆడపిల్ల ట్యూషన్లు చెప్పి మరీ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆ కూతురికి తండ్రివని చెప్పుకోవడానికి సిగ్గుగా లేదూ..."

హోతా పద్మినీదేవి

"లేదు...సిగ్గుగా లేదు, చాలా ఆనందంగా వుంది. మళ్ళీ మాట్లాడితే గర్వంగా కూడా వుంది. మీ రంతా తండ్రులు...తాతలు సంపాదించిన ఆస్తిని మీరు మీ పిల్లలికి కట్టబెడుతున్నారు. కాని ఈ బడిపంతులు తన కూతురికి అక్షర జ్ఞానం ఇచ్చాడు. ఆ అక్షరాలు అమ్ముకొని బ్రతకడమెలాగో కూతురికి చెప్పాడు. తాను బ్రతకడమే కాక తన కుటుంబాన్ని కూడా ఎలా పోషించుకోవాలో చెప్పాడు. అటువంటి కూతుర్ని కన్నందుకు గర్వపడుతున్నానయ్యా...నా కూతురు ప్రయోజకత్వం చూసి మురిసిపోతున్నాను. ఈ వయసులో నన్ను కష్టపెట్టడం ఇష్టంలేక నా కూతురు నన్ను కూర్చోబెట్టి తాను కష్టపడుతోంది. అటువంటి కూతుర్ని కన్నందుకు మురిసిపోతున్నానయ్యా..." తన వాదనకి రెండు దిశలూ వుంటాయని నిరూపించాడు కామయ్య.

"కొన్ని జాతకాలంతేలే...కాని బ్రహ్మచారికి గది అద్దెకు ఇవ్వడానికి నీవు సంశయిస్తున్నావంటే నీ గురించి తెలియనివారు సీత గురించి అపోహపడే అవకాశం వుంది. అందుకే తిడుతున్నాను.

అంతేగాని నీతో మరో మారు ప్రైవేటు చెప్పించుకోవాలని కాదు..."

"రేయ్, నాకా సంగతి బాగా తెలుసు. రామకృష్ణ హెగ్డేలా పార్టీ ఫిరాయించడానికి అవకాశం కోసం ఎదురు చూడకు. మన పిల్లలపట్ల మనకు ప్రేమ, అభిమానం, నమ్మకం వుంటాయి. ఉండి తీరాలి. అంత మాత్రాన మన జాగ్రత్తలో మనం లేకపోతే ఎలా? ఇంతెందుకు—నీకూ ముగ్గురు అమ్మాయిలు వున్నారు. ఈ కుర్రవాడా మీ వాడు. ఇతగాడికి మీ మేడమీదున్న గది ఓ పది రోజులు...పది అంటే పది రోజులు అద్దెకు ఇవ్వగలవా? ఇవ్వవు. ఎందుకంటే మీ ఇంట్లో పెళ్ళి కావలసిన ఆడపిల్లలు ముగ్గురు వున్నారు కనుక...అంటే మీ అమ్మాయిల మీద నమ్మకం లేక నీవు 'మీ కులపోడికి' కూడా గది...అదీ పది రోజులకు కూడా ఇవ్వలేదని నేనంటే నీ కాలి చెప్పుతీసి మరీ కొడతావ్. నేను పడతాను.

ఎందుకంటే నీవు వున్నోడివి—నేను లేనోడివి. అంతేగదా!"

'కామయ్య'గా ముద్రపడిన స్కూలు టీచరు కామేశ్వరరావు సంభాషణని ఎక్కడ ప్రారంభించి, ఎక్కడ ముగించాడో అర్థమయ్యింది మౌర్యకి. ఆ స్కూలు టీచరు మేధాసంపత్తికి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఏం బాబూ పొలమారిందా, ఉండు డ్రింకు తెప్పిస్తాను..." అంటూ సమాధానం కోసమయినా ఎదురు చూడకుండా టీ కొట్టు దగ్గర వున్న కుర్రోడ్ని పిలిచి మూడు కూల్ డ్రింక్స్ చెప్పాడు కామయ్య.

కామయ్య ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న ఆ పెద్ద మనిషి అపాలజిటిక్‌గా అన్నాడు—"అదికాదురా కాముడూ...పెద్దమ్మాయి పెళ్ళి మన రామనాథం కొడుకుతో స్థిరపడింది. అందుకనే ఇంటికి సున్నం కొట్టించి రంగులు పెట్టించాము. ఇప్పుడు మేడ మీద గది అద్దెకు అంటే..." అంటూ నసగసాగాడు.

"అవునండీ చక్కనమ్మ బలిసినా తంటా, చిక్కినా తంటా అంటారు. ఈ మాట నేను అంటే నా కూతురు మీద నాకే నమ్మకం లేనట్టు మాటాడారు. ఇప్పుడు మీ వరకొచ్చేసరికి పెళ్ళి వంక పెడుతున్నారు. ఇంకా పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకోలేదు. అంటే పది రోజుల లోపల ముహూర్తాలు పెట్టుకుని పెళ్ళి జేయవుగదా...ఈ పది రోజుల లోపల మీ కులపోడు మరో ఇల్లు చూసుకుంటాడుగదా!"— మరింత ఉచ్చులు బిగుసుకున్నాయి.

పెద్దాయనకి విషయం అర్థమయింది—కామయ్య తనని తెలివిగా బోల్తా కొట్టించాడని! ఇప్పుడు కాదంటే రేపు—రేపనేమిటి, అవకాశం



చిక్కినప్పుడల్లా పదిమందిలో తన పరువు తీస్తాడు. ఇప్పుడు చేయవలసిందేమిటి? ఓ పది రోజులు ఇతగాడికి ఆశ్రయమివ్వడమేనా?

—ఓ నిర్ణయానికి వచ్చిన ఆయన "బాబూ నీ పేరేమిటన్నావ్?" అనడిగాడు.

"మౌర్య...బి.ఇ. సివిల్—ఇరిగేషన్ డిపార్టుమెంటులో జూనియర్ ఇంజనీరుగా పోస్టింగ్ అయింది. ఓ పది రోజులు గది అద్దెకు ఇస్తే చాలు...ఈ లోపల ఇల్లు చూసుకోవాలనుకున్నాను. కాని మీ ఇద్దరి సంభాషణను బట్టి మీకు చాలా అసౌకర్యం కలిగిస్తున్నానని నాకు అర్థమయింది. క్షమించాలి—నేను ఇక్కడే ఏదో ఒక హోటల్‌లో ఏదో ఒక గది చూసుకుంటాను. నా పట్ల మీరు చూపిన ఔదార్యానికి నా కృతజ్ఞతలు" రామా ఈజ్ ఎ గుడ్ బోయ్ అన్న ధోరణిలో మాట్లాడాడు మౌర్య.

గండం గడిచినందుకు చాలా చాలా సంతోషించాడా పెద్దాయన. కాని సైంధవునిలా మరోమారు అడ్డుపడ్డాడు కామయ్య.

"చూడుబాబూ, నువ్వు ఈ మాట బాల్య స్నేహితులమైన మేమిద్దరం మాటమీద మాట విసురుకోకముందు చెప్పాల్సింది. ఇప్పుడు నువ్వు మా వాడి మేడ మీద గదిలో వుండవన్నావనుకో— దానికి విపరీతార్థాలు వస్తాయి. కనుక ఈ పది రోజులూ కష్టమో నిష్ఠూరమో ఆ గదిలోనే కాలక్షేపం చేయి. ఈ లోపల ఇల్లు వెదుక్కో."

'తప్పదా...' అన్నట్టుగా బేలగా చూస్తున్న మౌర్య చేతిలో కూల్ డ్రింక్ పెట్టాడు టీ బంకు కుర్రాడు.

ఏడ్వలేక నవ్వుతున్నట్టు వెర్రి నవ్వొకటి నవ్వేసి "అవునవును...అలాగే బాగుంటుంది" అన్నాడు ఆ పెద్దాయన.

చేతిలోని కూల్ డ్రింక్ బాటిల్ ఖాళీ చేసేసి "చూడు మౌర్యా...నీ పేరు చూస్తే మీ నాన్నగారి టేస్టు, నీ టేస్టు తెలుస్తోంది. నీవు ఈ పది రోజులు వుండబోయేది అలాటి ఇలాంటి ఇల్లనుకోకు. ఈయన రామస్వామిగారని బాగా డబ్బున్న–క్షమించాలి 'డబ్బున్న' మనిషి. పెద్ద బాలశిక్ష నుంచి కలిసి చదువుకున్నాం. కాకపోతే నేను కుచేలుడు స్టేటస్‌లో వున్నాను. ఈయన కుబేరుడు స్టేటస్‌లో వున్నాడు. ఈయనతో ఏమీ పేచీలేదుగాని ఈయనగారి కూతుళ్ళతోనే పేచీ...ఒకరిద్దరు కాదు, ముగ్గురు. జాగ్రత్త..." అంటూ హెచ్చరించాడు కామయ్య.

కక్కాలేక మింగాలేక, "సాయంత్రం కలుస్తావుగదా..." అని కామయ్య నుద్దేశించి అని "పద బాబూ వెళ్దాం..." అన్నాడు రామస్వామి, మౌర్యనుద్దేశించి.

"మీరుణం తీర్చుకోలేనండి, మళ్ళీ కలుస్తాను..." అని బయల్దేరిన మౌర్యని వెనక్కు పిలిచాడు కామయ్య. పిలిచి "బాబూ ఎప్పటి రుణం అప్పుడు తీర్చేస్తే బాగుంటుంది. మూడు కూల్‌డ్రింక్సుకి డబ్బులిచ్చేస్తే ఈ కుర్రవాడెళ్ళిపోతాడు..." అన్నాడు టీ కుర్రవాణ్ణి చూపిస్తూ.

కూల్‌డ్రింక్స్‌కి డబ్బులివ్వకుండా కామయ్యని ఏడిపించాలన్న చిలిపి ఆలోచన వచ్చిందిగాని,


## సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం: హైదరాబాద్-500 007

### 1991-92 సంవత్సరమునకు సప్లిమెంటరీ బ్యాచ్ కొరకు ప్రవేశములు

వయస్సు మరియు ప్రాంతము నిషేదము లేకుండా ప్రవేశము కలదు.

**ఆఫరు చేయబడిన కోర్సు:**

1. బి.ఎ. మూడు సంవత్సరములు (సంవత్సర వారీ) డిగ్రీ కోర్సు ఇంగ్లీషు మీడియంలో మాత్రమే.
2. బి.కాం. మూడు సంవత్సరములు (సంవత్సర వారీ) డిగ్రీ కోర్సు ఇంగ్లీషు మీడియంలో మాత్రమే.

**అర్హత:**

1. ఇంటర్మీడియెట్/పి.యు.సి. లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరూ.
2. పై తెలుపబడిన విద్యావిధానము (బి.ఎ., బి.కాం.)లో రెగ్యులర్ కాలేజీల నుండి విరమించుకొన్నవారు, మొదటి లేదా రెండవ సంవత్సరం పరీక్షయందు ఉత్తీర్ణులైనవారు, ప్రమోట్ కాబడినవారు లేదా కనీసం తప్పినవారు (ఉస్మానియా విశ్వవిద్యాలయం కాక ఇతర విశ్వవిద్యాలయముల పరిధిలోగల కాలేజీల నుండి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే) కరస్పాండెన్స్ కోర్సుల ద్వారా రెండవ లేదా మూడవ సంవత్సరం విద్యనభ్యసించుటకుగాను ప్రవేశము పొందుటకు అర్హులు.

**ప్రాస్పెక్టస్:**

ప్రాస్పెక్టస్ మరియు పూర్తి వివరములతో కూడిన దరఖాస్తు ఫారంను పొందగోరువారు "డైరెక్టర్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఉస్మానియా యూనివర్సిటీ" వారి పేరున వారికి ఏదేని జాతీయ బ్యాంకు నందు హైదరాబాద్ వద్ద చెల్లింపు అయ్యేలా పొందిన రూ. 15/- విలువ గల డిమాండ్ డ్రాఫ్టును సమర్పించి పొందవచ్చును. ప్రాస్పెక్టస్‌ను పోస్టుద్వారా పొందగోరువారు రూ. 15/- విలువగల డిమాండ్ డ్రాఫ్టుతో పాటు 11"x5" సైజుగల రూ. 2-00 స్టాంపులు అంటించిన స్వంత చిరునామాగల కవరును కూడా పంపి పొందవచ్చును.

**ఆఖరి తేదీ:**

ఎట్టి అపరాధ రుసుము లేకుండా ప్రవేశము కొరకు పూర్తి కావింపబడిన దరఖాస్తు ఫారములు సమర్పించుటకు ఆఖరి తేదీ: 31-1-1992. ఆ పిమ్మట సమర్పించిన దరఖాస్తు ఫారములకు ప్రాస్పెక్టస్‌లో నిర్దేశించబడిన ప్రకారం అపరాధ రుసుము చెల్లించవలసి యుంటుంది. మాకు ఎచ్చటా బ్రాంచీలు లేవు.

(సం) XXXXXX
డైరెక్టర్

–దగ్గర్లోనే రామస్వామి వున్నాడని ఆ ప్రయత్నం మానుకున్నాడు మౌర్య. టీ కుర్ర వాడు డబ్బులు తీసుకుని ఖాళీ టాటి ల్సుతో వెళ్ళిపోయాడు. అప్పుడు అడిగాడు కామయ్య–"మౌర్యా! నీవు రావడం రావడం కామేశ్వరరావు మాష్టారుని అడిగావ్. నీకు కామేశ్వరరావు మాష్టారి గురించి చెప్పిందె వరు?" అని.

"మాష్టారూ! ప్రస్తుతానికి అది సస్పెన్స్. విష్ మీ బెస్టాఫ్ లక్..." అంటూ నవ్వుతూ వెళ్తున్న మౌర్య ఇచ్చిన షాక్‌కి దిమ్మెరపోయి చూశాడు కామయ్య.

కాని ఇదేమీ గమనించని వాడిలా వెళ్తున్న మౌర్య "రండి సార్...మోటారు సైకిల్ మీద వెళ్దాం"

అని రామస్వామి నుద్దేశించి అని తన మోటారు సైకిల్ వైపు దారి తీశాడు.

"ఇదిగో మౌర్యా, నీవు నీ బండి మీదరా... నేను నడిచి వస్తాను. అదిగో ఆ కనిపిస్తున్న మేడే..." అంటూ రంగులేసిన ఓ మేడని చూపించాడాయన.

"అలాగే సార్..." అంటూ వెళ్ళి మోటారు సైకిల్ స్టార్ట్ చేసిన మౌర్య మెల్లగా ఆ మేడ వైపు డ్రైవ్ చేశాడు.

అయితే ఈ లోపు చిన్న గమ్మత్తు జరి గింది. కామయ్య వున్నవాడు వున్నట్టుగా వుండకుండా రామస్వామిని వెనుకకు పిలి చాడు–పెళ్ళి ఏర్పాట్లు ఎంత వరకు జరిగా యన్న మిషతో!


కామయ్య కొంటెపని మౌర్యకి అర్థమ యింది.

మేడ ముందు మోటారు సైకిల్ ఆపిన మౌర్య సందిగ్ధంలో పడ్డాడు. లోపలికి వెళ్ళాలా? వద్దా?

వెళ్తే 'ఎవరండీ మీరు?' అనడిగితే ఏం చెప్పాలి?

వెళ్ళకుండా ఇంటిముందే నిలబడితే - పెళ్ళి కావలసిన ఆడపిల్లలు వున్న ఇంటి ముందు నిలబడిన తనని చూసి ఏమనుకుంటారు?

మౌర్య ఈ ఆలోచనల్లో వుండగా ఆ మేడకు ఎదురుగా వున్న ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. మంచు దెబ్బ తిన్న మల్లెలా వున్న ఓ ఆడకూతురు బయటకు వచ్చింది.



ఆమెను చూస్తే కన్నె పిల్ల అనిపించడం లేదు. ఆమె బోసి మెడ ఆమె వర్తమానాన్ని చెబుతోంది.

'ఎవరు కావాలి?' అని ఆమె నోరు తెరచి అడగలేదు. కాని ఆమె చూపుల్ని అర్థం చేసుకున్న మౌర్య చెప్పాడు- "రామస్వామి గారితో వచ్చాను. ఆయన వెనుక వస్తున్నారు..." ఏదో సంజాయిషీ ఇస్తున్న వాడిలా వుందతని కంఠం.

ఆ సమాధానం వింటూనే ఆమె ముఖ కవళికలు మారిపోయాయి. కాని ఆమె మోటారు సైకిల్ మీదున్న బెడ్ హోల్డర్ని గుచ్చిగుచ్చి చూడడం గమనించి, "నా పేరు మౌర్య. నేను ఇంజనీర్ని. ఇక్కడ ఉద్యోగం వచ్చింది. రామస్వామి గారు మా నాన్నగారి స్నేహితులు. ఇల్లు వెదుక్కునే వరకు ఓ పది రోజులు వాళ్ల మేడ మీద గదిలో వుండమన్నారు..." ఆమె ఏమీ ప్రశ్నించకమునుపే అతడికి అతడుగా సంజాయిషీ ఇవ్వడం ప్రారంభించాడు.

"చాలా సంతోషమండీ, మీ వంటి చదువుకున్న వారు మా ఇంటికి ఎదురుగా వుండడం... చాలా ఆనందంగా వుంది. అయితే అక్కయ్య గారు వాళ్లు ఓ నెల రోజుల్లో వచ్చేస్తారన్న మాట" అని ఆమె అన్న ఆ 'అక్కయ్య గారు' ఎవరో అతడికి అర్థమయింది. అర్థమయి, "క్షమించాలి... నాకింకా పెళ్ళికాలేదు" అన్నాడు.

అంతే!!

ఆమె ముఖం ఒక్కసారిగా ఆనందంతో విప్పారింది. "నిజమా... భలేవారండీ మీరు, అసలు మీ వంటి ఉద్యోగస్తులు మా ఇంట్లో అద్దెకు వుంటే ఎంత బాగుంటుందో! కాని మా ఇల్లు ఖాళీగా లేదు అద్దెకి ఇవ్వడానికి. అదొక్కటే నా 'బాధ" అని చెబుతున్న ఆమె హఠాత్తుగా తలుపు చాటుకి తప్పుకుంది.

ఏమిటి చెప్మా ఈమె ఇంత తొందరగా నన్నొదిలి పెట్టింది? అని ప్రక్కకు చూసిన మౌర్య కళ్ళు ఆనందతరంగాలయ్యాయి.

రామస్వామితో ఏవో కబుర్లు చెబుతూ వస్తోందామె.

రెండు పదుల వయసు నిండిన ఆమె రతీదేవి చెల్లెల్లా వుంది.

ఆమె నడకలో ఏదో ప్రత్యేకత కనిపిస్తోందతడికి.

(సశేషం)

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్